క్లుప్తంగా

బాలసదనం చిన్నారులకు బాణసంచా అందజేత



బాలసదనంలోని పిల్లలకు బాణసంచా అందిస్తున్న రామకృష్ణ

భీమునిపట్నం: భీమిలిలోని బాలసదనం పిల్లల వసతి గృహంలోని పిల్లలకు టీచర్స్ హెల్ప్ గ్రూప్ దీపావళి బాణసంచాను అందించారు. రూ.20వేలు విలువ గల ఈ సామగ్రిని గ్రూప్ అధ్యక్షుడు మరగడ రామకృష్ణ అక్కడి చిన్నారులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ పిల్లలందరూ సరదాగా దీపావళి జరుపుకోవాలని తమ వంతు సహకారం అందిస్తున్నామన్నారు. తమ సభ్యులైన వెంకటరెడ్డి, సూరిబాబు, లలిత సహకారంతో వీటిని అందించామన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు కంటుభుక్త ముత్యాలరావు పాల్గొన్నారు.

సాగర తీరంలో శ్రీకాంత్



లొకేషన్‌లో నటుడు శ్రీకాంత్

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు మంగమారిపేట సాగరతీరాన ప్రముఖ నటుడు శ్రీకాంత్ బుధవారం సందడి చేశారు. నందమూరి కల్యాణ్ రామ్ నటిస్తున్న సినిమాలో శ్రీకాంత్ ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ఈ నేపథ్యంలో బీచ్‌కు సంబంధించిన కొన్ని సన్నివేశాలను ఇక్కడ చిత్రీకరించారు. సాయంత్రం ఇదే సినిమాకు సంబంధించి మరో నటుడు పృథ్విపై కొన్ని సన్నివేశాలు చిత్రీకరించారు.

తప్పల సవరణకు 5 దరఖాస్తులు

పద్మనాభం: రీ సర్వేలో తప్పుల సవరణ కోసం మండలంలోని జానీదేవిపురంలో బుధవారం నిర్వహించిన గ్రామ సభలో ఐదు దరఖాస్తులు వచ్చాయి. పేర్లు సరి చేయాలని ముగ్గురు, విస్తీర్ణం సరి చేయాలని ఇద్దరు దరఖాస్తు చేసుకున్నారు. వీరి నుంచి తహసీల్దార్ కె.ఆనందరావు దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

2న ఇస్కాన్‌లో గోవర్ధన పూజా మహోత్సవం

కొమ్మాది: బీచ్‌రోడ్డు సాగర్‌నగర్ ఇస్కాన్ టెంపుల్‌లో నవంబర్ 2న గోవర్ధన పూజా మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు ఇస్కాన్ అధ్యక్షుడు సాంబదాస్ ప్రభుజీ ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు గోవర్ధన పర్వతాన్ని తలపించే విధంగా అన్నం, వివిధ రకాల స్వీట్స్, పలుకులు, పండ్లతో అన్నకూట ఉత్సవం జరిపించనున్నట్లు తెలియజేశారు. అనంతరం పంచామృతాభిషేకాలు, పుష్పాభిషేకాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

బీచ్ ఫొటోగ్రాఫర్లకు టీషర్ట్‌ల పంపిణీ



ఫొటోగ్రాఫర్లకు టీషర్ట్‌లు అందిస్తున్న మల్లికార్జునరావు, జెడ్పీ ప్రేమప్రసన్న వాణి

భీమునిపట్నం: భీమిలిలోని సాగర్ అసోసియేషన్ ఆఫ్ వాకర్స్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం బీచ్ ఫొటోగ్రాఫర్లకు టీషర్ట్‌ల పంపిణీ జరిగింది. కార్యక్రమానికి హాజరైన జోనల్ కమిషనర్ ప్రేమ ప్రసన్న వాణి, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట మల్లికార్జునరావు చేతులమీదుగా 70 మంది ఫొటోగ్రాఫర్లకు టీషర్ట్‌లు అందించారు. వాకర్స్ అధ్యక్షుడు మల్లికార్జునరావు మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్లకు టీషర్ట్‌లతో పాటు ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోతున్న వారిని రక్షించేందుకు నాలుగు లైఫ్ జాకెట్లు అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో విశాఖ లయన్స్ క్లబ్ ప్రతినిధులు, వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

దీపావళికి ధరల సెగ

మార్కెట్‌లో కానరాని సందడి



ప్రైవేట్ మార్కెట్‌లో ప్రమిదల విక్రయాలు



బంగ్లామెట్ట వద్ద వెలవెలబోతున్న బాణసంచా దుకాణాలు

తగరపువలస: ఈ ఏడాది దీపావళి కాంతులు అంతంతమాత్రమే అనిపిస్తోంది. నియోజకవర్గంలో పండగ జోష్ అంతగా కనిపించడం లేదు. బాణసంచా తయారీ, కొనుగోళ్లు అంతకు ముందు సంవత్సరాలతో పోలిస్తే డల్‌గా కనిపిస్తున్నాయి. అంతో ఇంతో మట్టి ప్రమిదలకు తప్ప, అలంకరణ సామగ్రి, టపాసులకు గిరాకీ లేదనిపిస్తోంది.

భగ్గుమంటున్న నిత్యావసర సరకులు, ఆకాశాన్నంటిన టపాసుల ధరలు, తుపాను హెచ్చరికలు, నెలాఖరు కావడంతో మార్కెట్‌లో పండగ శోభ కనిపించడం లేదు. సాధారణంగా వరలక్ష్మీ వ్రతం, వినాయకచవితి, దసరా, దీపావళి, సంక్రాంతి పర్వదినాలు జరిగే ముందురోజు స్థానిక ప్రైవేట్ మార్కెట్ కిక్కిరిసిపోతూ ఉంటుంది. డివైడర్లను చిరువ్యాపారులు ఆక్రమించేస్తుంటారు. దీంతో అంబేద్కరు కూడలిలోకి వచ్చే బస్సులు ఒకవైపే రాకపోకలు సాగిస్తుంటాయి. కానీ అలాంటి వాతావరణం కనిపించలేదు. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగే వ్యాపారంతోనే మతాబుల వ్యాపారులు పెట్టుబడులు సాధించుకోవాలి.





బోసిపోయిన తగరపువలస మెయిన్‌రోడ్డు

కొనుగోళ్లకు విజయనగరం వైపు..

భీమిలి నియోజకవర్గంలోని స్టాళ్లలో అందుబాటులో ఉండే బాణసంచా ధరలతో పోలిస్తే విజయనగరంలో హోల్‌సేల్ దుకాణాలలో తక్కువ ధరలకు లభిస్తుంటాయి. విజయనగరం ఇక్కడికి 21 కి.మీ. దూరం మాత్రమే ఉండడంతో స్థానికులలో ఎక్కువ మంది ద్విచక్రవాహనాలపై విజయనగరం వెళ్లి సామాన్లు కొనుక్కుని వస్తుంటారు. దీంతో భీమిలిలో దీపావళి రోజు జరిగే విక్రయాలపైనే వ్యాపారులు ఆధారపడుతుంటారు.

కుమ్మర్లకూ తగ్గిన గిరాకీ

భీమిలి నియోజకవర్గంలోని సంతపేట, తాటితూరు, పాట్నూరు గ్రామాలలో మాత్రమే కుమ్మరి వృత్తి చేసేవారు ఉన్నారు. గతంలో పండగకు 6 నుంచి 9 మాసాల ముందే చిచ్చుబుడ్లు, ప్రమిదలు తయారు చేసి నిల్వ చేసేవారు. వీటితో పాటు మందు కొనుక్కుని దిట్టించేసరికి పెట్టుబడులు కూడా పెరిగిపోతున్నాయి. తమిళనాడు నుంచి రెడీమేడ్ చిచ్చుబుడ్లు వివిధ సైజులలో తక్కువ ధరలకే లభిస్తున్నాయి. దీంతో కుమ్మర్లకు ఈ ఏడాది అంతగా పని లేకుండా పోయింది. అలాగే ఎర్రమట్టితో తయారు చేసే వివిధ డిజైన్ల ప్రమిదలు కూడా విరివిగా లభిస్తుండటంతో ఆన్‌లైన్‌లో కూడా విక్రయిస్తున్నారు. దీంతో మట్టి ప్రమిదలకు అంతగా గిరాకి కనిపించడం లేదు.

38 దుకాణాలకు అనుమతి

బుధ, గురువారాలలో మతాబుల విక్రయాలకు తగరపువలస శివారు బంగ్లామెట్టలో 23, భీమిలిలో 4, ఆనందపురంలో 6, పద్మనాభంలో 5 కలిపి మొత్తం 38 బాణసంచా దుకాణాలకు తాళ్లవలస అగ్నిమాపక శాఖాధికారి జి.శ్రీనివాసరాజు అనుమతులు ఇచ్చారు.

దీపావళి సందడి తగ్గింది



ఈ ఏడాది భీమిలిలో దీపావళి సందడి తగ్గింది. సాధారణంగా ఒకటో తేదీ నుంచి పదో తేదీ వరకు జరిగే పండగలకు ప్రజల దగ్గర డబ్బులు ఉంటాయి. నెల చివర్లో వచ్చే పండగ లంటే ఇబ్బందే. మార్కెట్ కూడా డల్‌గా ఉంది.

–ఆకెళ్ల రవిగణేష్, అర్చకుడు

ముగిసిన అనంతుని పవిత్రోత్సవాలు

నేత్రపర్వంగా శాంతికల్యాణం



స్వామి వారి కల్యాణం జరిపిస్తున్న రుత్వికులు



నవ కుంభ జలాలతో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న రుత్వికులు, భక్తులు

పద్మనాభం: పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో నాలుగు రోజులుగా జరుగుతున్న అనంత పద్మనాభ స్వామి పవిత్రోత్సవాలు బుధవారం శాంతి కల్యాణంతో ముగిశాయి. ముందుగా విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, నిత్య హోమం నిర్వహించారు. తదుపరి కుంతీ మాధవ స్వామి, శ్రీదేవి భూదేవి సమేత అనంత పద్మనాభ స్వామి ఉత్సవ విగ్రహాలు.. తిరుమంగళ్వారు, లక్ష్మీదేవి, గోదాదేవి విగ్రహాల నుంచి రుత్వికులు పవిత్రాలను విసర్జింప చేశారు. అనంతరం నవ కుంభ జలాలతో రుత్వికులు, భక్తులు కుంతీ మాధవ స్వామి ఆలయం చుట్టూ పదక్షిణ చేశారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత అనంత పద్మనాభ స్వామి ఉత్సవ విగ్రహాలకు రుత్వికులు శాంతి కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, వైఎస్సార్ సీపీ నాయకులు తాలాడ పద్మనాభం, బోని సన్యాసినాయుడు, గాడు అప్పలరాజు, వీఎంఆర్‌డీఏ మాజీ చైర్‌పర్సన్ అక్కరమాని విజయ నిర్మల, కృష్ణాపురం ఎంపీటీసీ సభ్యురాలు కంటుబోతు లక్ష్మి, భక్త బృందం పాల్గొన్నారు.

వైభవంగా ధన త్రయోదశి పూజలు



కరెన్సీ నోట్ల అలంకరణలో ధనలక్ష్మి అమ్మవారు

కొమ్మాది: స్థానిక అన్నంరాజునగర్ అష్టలక్ష్మి దేవాలయంలో బుధవారం ధనత్రయోదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శ్రీధర స్వామి ఆధ్వర్యంలో ధన లక్ష్మి అమ్మవారిని కరెన్సీ నోట్లతో అలంకరించి, నాణేలతో అర్చన చేశారు.

రాష్ట్రస్థాయి పరుగు పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన హర్షిణి, శృతిక

తగరపువలస: ఆనందపురం మండలం శిర్లపాలెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు హర్షిణి, శృతిక రాష్ట్రస్థాయి రన్నింగ్ పోటీలకు ఉమ్మడి విశాఖ జిల్లా తరపున ఎంపికయ్యారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం మెడికల్ కళాశాల గ్రౌండ్‌లో బుధవారం జరిగిన ఉమ్మడి విశాఖ జిల్లాల అథ్లెటిక్స్ పోటీలలో వీరు ఎంపికయ్యారు. 9వ తరగతి విద్యార్థిని రేగాని హర్షిణి 600 మీటర్ల రన్నింగ్‌లో ప్రథమ స్థానంలో నిలవగా, 8వ తరగతి విద్యార్థిని రేగాని శృతిక 400 మీటర్ల రన్నింగ్‌లో ప్రథమ స్థానం, 200, 100 మీటర్ల రన్నింగ్‌లో ద్వితీయ స్థానం సాధించారు. వీరిద్దరిని ప్రధానోపాధ్యాయిని శారద, ఫిజికల్ డైరెక్టర్ సత్యం, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు అభినందించారు.

రాజ్యలక్ష్మి ఆలయ భూముల ఆక్రమణలపై ఫిర్యాదు



ఆక్రమణలపై తహసీల్దార్‌కు వివరిస్తున్న ఆలయ ట్రస్టీ శివ రామకృష్ణ

పద్మనాభం: మండలంలోని ఐనాడలో రాజ్యలక్ష్మి అమ్మవారి ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించాలని ఆలయ ట్రస్టీ మామిడి శివ రామకృష్ణ తహసీల్దార్ కె.ఆనందరావును కోరారు. అమ్మవారి ఆలయంలో షెడ్లు నిర్మించి కొంతమంది ఆక్రమించారని ఆ ఫిర్యాదులో తెలిపారు. భీమిలి మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోరాడ పాపారావు, ఐనాడ మాజీ సర్పంచ్ కోరాడ రామేశ్వరరావు ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.

శివాలయం వీధిలో 'నరకాసుర వధ'



దహనమవుతున్న నరకాసురుడి బొమ్మ

భీమునిపట్నం: భీమిలి శివాలయం వీధి వద్ద బుధవారం సాయంత్రం నరకాసుర వధ కార్యక్రమం నిర్వహించారు. స్థానికంగా నివసిస్తున్న డాక్టర్ ముమ్మిడిశెట్టి ఆదిత్య పర్యవేక్షణలో ప్రతీ ఏటా నిర్వహించినట్లే ఈ ఏడాది కూడా టపాసులతో భారీ బొమ్మను తయారు చేశారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణాలయ ప్రధాన అర్చకులు రొంపిచర్ల సింగరాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఈ బొమ్మను దహనం చేశారు. స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రబీలో రాగి పంట సాగు మేలు

పద్మనాభం: రైతులు రబీలో రాగి(చోడి) పంటను సాగు చేయాలని భీమునిపట్నం సబ్ డివిజన్ వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.విజయ్ ప్రసాద్ అన్నారు. మండలంలోని కృష్ణాపురం, రెడ్డిపల్లి పంచాయతీ సుంకర పేట గ్రామాల్లో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాగి పంట సాగు చేయడం వల్ల పెట్టుబడి తక్కువై అధిక దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమాల్లో జిల్లా వనరుల కేంద్రం ఏడీ చదువుల సుబ్రమణ్యం, ఏఈ ఎంపీఏస్ చలం, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

విలువలు, క్రమశిక్షణతో సత్ఫలితాలు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మంజుల

భీమునిపట్నం: ప్రతి విద్యార్థి విలువలు పాటిస్తూ, క్రమశిక్షణతో చదువుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల సూచించారు. అప్పుడే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. కళాశాలలో జరిగిన ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థుల్లో చాలామందికి పెద్దల పట్ల గౌరవ, మర్యాదలు లేవని, దానివల్ల ఎన్నో అనర్థాలు తలెత్తుతున్నాయని అన్నారు. ముఖ్యంగా కొందరు మత్తు పదార్థాలకు బానిసలైపోతున్నారని ఇటువంటి వాటిని అరికట్టవలసిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. విద్యార్థులందరూ లక్ష్యాన్ని ఏర్పరచుకుని, చక్కగా చదువుకోవాలని తద్వారా మంచి ఫలితాలను సాధించవచ్చని అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐక్యతతోనే ప్రగతి



కార్యక్రమంలో పాల్గొన్న ఛాత్రోపాధ్యాయులు, అధ్యాపకులు

భీమునిపట్నం: అందరూ ఐక్యతతో కలసి మెలసి ఉంటేనే ప్రగతిని సాధించగలమని స్థానిక జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్) ప్రిన్సిపాల్ ఎం.జ్యోతికుమారి అన్నారు. జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ముందుగా సర్దార్ వల్లభాయ్ పటేల్, ఇందిరాగాంధీ చిత్రపటాలకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐక్య భారతావని కోసం ఎనలేని సేవలందించిన సర్దార్ వల్లభాయ్ పటేల్ నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఉక్కు మనిషిగా పటేల్, ఉక్కు మహిళగా ఇందిరా గాంధీ చిరస్మరణీయులన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు మహాలక్ష్మి, గొట్టేటి రవి, హారిణి, నీలిమ, సోమయాజులు పాల్గొన్నారు.

'విద్యుత్ చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలి'



మధురవాడలో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

తగరపువలస: రాష్ట్ర ప్రభుత్వం నవంబరు నుంచి వినియోగదారులపై యూనిట్‌కు రూ.1.58 పైసలు వంతున భారం మోపనుందని, ఈ ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోకపోతే ప్రజా ఉద్యమం తప్పదని ఏఐటీయూసీ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అచ్యుతరావు హెచ్చరించారు. చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈఈ బొట్టా రవికి బుధవారం వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యుత్ చార్జీల పెంపుతో ప్రజలపై తీవ్ర ఆర్థిక ఒత్తిడి పెరిగిపోతుందన్నారు. ఇప్పటికే నిత్యావసర సరకుల ధరల భారంతో బాధపడుతున్న ప్రజలకు విద్యుత్ చార్జీల పెంపు మరింత భారం కానుందన్నారు. ఈ ప్రతిపాదనను వెనక్కు తీసుకోవాలన్నారు. ఆయన వెంట నాయకులు కానూరి రాంబాబు, అల్లు బాబూరావు, కొండపు ఈశ్వరరావు, మోర అప్పలరాజు తదితరులున్నారు.

మధురవాడలోని జోన్–3 కార్యాలయం వద్ద..

మధురవాడ: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలు వెంటనే రద్దు చేయాలని సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం మధురవాడలోని విద్యుత్ శాఖ విశాఖ జోన్–3 కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు మాట్లాడుతూ ప్రభుత్వం ఒక వైపు ఉచిత గ్యాస్ బండ అని మరో వైపు విద్యుత్ చార్జీల గుది బండ మోపుతోందన్నారు. కూటమి ప్రభుత్వానికి ఇది న్యాయం కాదన్నారు. అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. అనంతరం ఈఈ శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి నాయకులు ఎండీ బేగం, ఏరియా కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలి



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న బ్యాంక్ మేనేజర్ శరత్‌చంద్ర

తగరపువలస: విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంచుకుని దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కెనరా బ్యాంక్ మేనేజర్ దాసరి శరత్‌చంద్ర అన్నారు. విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా నిజాయితీ, సంస్కృతి ద్వారా దేశ శ్రేయస్సు కార్యక్రమాన్ని కెనరా బ్యాంకు ఆనందపురం శాఖ అధికారులు స్థానిక జెడ్పీ హైస్కూల్లో నిర్వహించారు. అవినీతిని ఎదుర్కోవలసిన విధానంపై విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా చర్చించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆర్కే పట్నాయక్, ఇతర పాఠశాలల సిబ్బంది పాల్గొన్నారు.

'అమ్మవార్ల ఆలయాలను ఆక్రమించేస్తున్నారు'

తగరపువలస: భీమిలి మండలం అన్నవరం పంచాయతీ సర్వే నంబర్ 1లో మత్స్యకారుల గ్రామదేవతలైన ఆదిసత్తమ్మ, కోడా సత్తమ్మ ఆలయాలను దివీస్ యాజమాన్యం కబ్జా చేయకుండా అడ్డుకోవాలని ఆంధ్రప్రదేశ్ మత్స్యకారుల అభివృద్ధి సంక్షేమ సేవాసంఘం అధ్యక్షుడు అల్లిపల్లి ఎల్లాజీ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గతంలో ఇదే సర్వే నంబర్‌లో 50 ఎకరాలు ఆక్రమించుకుని, 15 అడుగుల ప్రహరీతో పాటు భవనాలు నిర్మించారన్నారు. ఇటీవల మరో 40 నుంచి 50 ఎకరాలలో ఆక్రమణ జరుగుతోందన్నారు. ఆలయాలు, భూములు, గ్రామాన్ని నాశనం చేసిన దివీస్ యాజమాన్యం సముద్రాన్ని కూడా వదలడం లేదని, వేటకు అనువుగా లేకుండా రసాయన పైపులు వేసిందని తెలిపారు. అడ్డుకుంటే పోలీసు కేసులు పెడతామని బెదిరిస్తున్నారన్నారు. ఇప్పటికే చాలావరకు మత్స్యకారులు పంచాయతీని విడిచిపెట్టి వెళ్లిపోయారన్నారు. దీనిపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు. ఇప్పటికే కలెక్టర్, ఆర్డీవో, భీమిలి తహసీల్దార్‌లకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్టు తెలియజేశారు.

పోలీస్ బెటాలియన్‌లో రక్తదాన శిబిరం



రక్తదానం చేసిన పోలీస్ సిబ్బందికి డ్రింక్ అందిస్తున్న మురళీకృష్ణ

పీఎం పాలెం: రక్తదానంతో ప్రాణదానం చేసినవారవుతారని 16వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ కేవీ మురళీకృష్ణ అన్నారు. ఆరో వార్డులోని ఏపీఎస్‌పీ పోలీస్ బెటాలియన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. స్థానిక సిబ్బంది, అధికారులు స్వచ్ఛందంగా రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. శిబిరంలో 150 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో కేజీహెచ్ డాక్టర్ సబ్బవరపు చంద్రబాబు, బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ సీహెచ్‌వీఎస్ పద్మనాభరాజు తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనంపై వేటు

వైజాగ్ ఎంపీ తాలూకా అంటూ ఓ వ్యక్తి నిర్వాకం



చెట్లు నరికి పడేసిన కొమ్మలు



మోడుగా మారిన చెట్టు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు పెద రుషికొండలో ఓ వ్యక్తి తన ఇంటికి అడ్డుగా ఉన్నాయని చెట్లు నరికివేసిన సంఘటన చోటు చేసుకుంది. ఎటువంటి అనుమతులు లేకుండా చెట్లు నరికి వేయడంతో స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. చెట్లు నరికివేయడంపై జీవీఎంసీ అధికారులు వెళ్లి ప్రశ్నించగా తాను వైజాగ్ ఎంపీ గారి తాలూకా అని, ఏం చేసుకుంటారో చేసుకోమని చెప్పడంతో అధికారులు వెనుదిరిగారు. ప్రస్తుతం వాతావరణంలో కలుగుతున్న మార్పుల వలన పచ్చదనం పరిరక్షించాలని, మొక్కలు నాటాలని ప్రభుత్వం ప్రచారం చేస్తున్న నేపథ్యంలో పచ్చని చెట్లు నరికివేయడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రకృతికి నష్టం కలిగించేవారు ఎంతటివారైనా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మద్యం దుకాణంతో స్థానికుల అవస్థలు

నవంబర్ 3న నిరసనకు సిద్ధం



దుకాణం బయటే బాటిళ్లు తెరచి తాగేస్తున్నారిలా..



మద్యం దుకాణం ముందు కొండపేట రహదారిని ఆక్రమించేసిన మందుబాబులు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు కొండపేట రహదారిలో మద్యం దుకాణం వలన ఆ గ్రామానికి వెళ్లే మహిళలు, విద్యార్థినులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. సాయంత్రమే కాకుండా పగటివేళ కూడా రాకపోకలు సాగించేందుకు సాహసించడం లేదు. ఇక్కడి మద్యం దుకాణంలో బాటిళ్లు కొనుక్కుంటున్న మందుబాబులు అక్కడే తెరిచి, తాగేసి పడిపోతున్నారు. రహదారిని ఆక్రమిస్తున్నారు. మద్యం దుకాణానికి అనుబంధంగా చుట్టూ పదుల సంఖ్యలో ఫాస్ట్‌ఫుడ్ దుకాణాలు పుట్టుకువచ్చాయి. మద్యం మత్తులో మహిళలపై వేధింపులకు పాల్పడుతున్నారు. ఇక్కడ మద్యం దుకాణాన్ని తొలగించాలని ఈ నెల 7వ తేదీన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు కూడా చేశారు. ఈ నెల 22లోగా పరిష్కరిస్తామని ఫిర్యాదుదారులకు రసీదు కూడా ఇచ్చారు. సమయం గడిచినా సమస్య పరిష్కారం కాకపోగా మరింత జటిలమవుతోంది. దీంతో మద్యం దుకాణం తొలగించాలని కోరుతూ నవంబరు 3న అంబేద్కర్ కూడలి వద్ద కొండపేట, కొత్తపేట వాసులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. తమకు మద్దతు పలకాలని కోరుతూ సోషల్ మీడియాను ఆశ్రయించడంతో ఈ మెసేజ్ ప్రస్తుతం చక్కర్లు కొడుతోంది.



మద్యం దుకాణం ముందు బెల్టు దుకాణం